# షకీల్‌ను మరోసారి ఆశీర్వదించండి

- అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తాం..
- ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా

బోధన్, నవంబర్ 8: బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మహ్మద్ షకీల్‌ను మరోమారు ఆదరించి గెలిపించాలని ఆయన సతీమణి ఆయేషా ఫాతిమా అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని 24వ వార్డు హనుమాన్ టేక్డీ ప్రాంతంలో స్థానిక కౌన్సిలర్ సుధారాణి, పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. తాము ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలతోపాటు, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఎమ్మెల్యేకు ప్రజల్లో మంచి ఆదరణ ఉందని అన్నారు. కారుగుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా మహ్మద్ షకీల్‌ను గెలిపిస్తే అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, కౌన్సిలర్ డేగావత్ ధూప్‌సింగ్ నాయక్, నాయకులు అబ్బగోని గంగాధర్‌గౌడ్, పార్టీ కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్, శేఖర్‌తోపాటు పలువురు వార్డుకు చెందిన మహిళలు, ప్రజలు ఉన్నారు.



బోధన్ పట్టణంలోని 24వ వార్డు హనుమాన్ టేక్డీ ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా

### బీఆర్ఎస్‌ను గెలిపించండి

బోధన్ రూరల్, నవంబర్ 8: ఈనెల 30 నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్‌ను గెలిపించాలని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రీరాజేశ్వర్, ఆ పార్టీ సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ అన్నారు. బుధవారం సాలూరా మండలంలోని పత్తేపూర్ గ్రామంలో ఎమ్మెల్యే షకీల్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించారు.



సాలూర మండలం పత్తేపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ బుద్దెసావిత్రీ రాజేశ్వర్

### రైతుబంధు సాయం రూ.16వేలు అందిస్తాం..

రెంజల్, నవంబర్ 8: ముడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు బంధు పథకం కింద రూ. 16.వేలు అందుతుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేషుగారి భూమారెడ్డి అన్నారు. రెంజల్ మండలం దూపల్లి గ్రామంలో భూమారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్ తరపున ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఓటర్లకు వివరించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. మాజీ సర్పంచ్ సుదర్శన్ యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ సాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దూపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూమారెడ్డి , నాయకులు



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే షకీల్

## ప్రతి కుటుంబానికీ కేసీఆర్ అండ

**బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్**

బోధన్ రూరల్, నవంబర్8: ప్రతి కుటుంబానికీ సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతుబీమా, సీఎంఆర్ఎఫ్ వైద్య ఖర్చులు అందజేస్తూ అండగా నిలిచారని బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్ అన్నారు. బుధవారం సాలూరా మండలంలోని సాలంపాడ్ క్యాంపు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా షకీల్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సాలంపాడ్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గైని గంగారాం, మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, పార్టీ నాయకుడు బుద్దె రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాలూరా షకీల్, పార్టీ సాలూరా మండల అధ్యక్షుడు నర్సన్న, ఎంపీటీసీ వెంకట్‌రావు, విండో మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

## నేడు బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ నామినేషన్

బోధన్, నవంబర్ 8: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం బోధన్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన స్వగృహం ఆచన్‌పల్లి నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగనుంది. ర్యాలీతో అంబేద్కర్ చౌరస్తా వరకు చేరుకుంటారు. అక్కడి నుంచి షకీల్ ప్రతినిధులతో కలిసి వెళ్లి నామినేషన్ పత్రాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.రాజాగౌడ్‌కు సమర్పిస్తారు. నామినేషన్ అనంతరం బయట ప్రజలు, అభిమానులు, పార్టీ కార్యకర్తలనుద్దేశించి మహ్మద్ షకీల్ ప్రసంగిస్తారని బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీల చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అభిమానులు తరలిరావాలని కోరారు.

### బోధన్‌కు తరలిరావాలి

రెంజల్, నవంబర్ 8: బోధన్ పట్టణంలో గురువారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మహ్మద్ షకీల్ నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు శేషుగారి భూమారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్ ఇంటి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగే ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

రెంజల్, నవంబర్8: మండలంలోని కందకుర్తి అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు, తెలంగాణ చౌరస్తా, రెంజల్ ప్రధాన రోడ్డు మార్గంలో బుధవారం వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాల్లో ఆధారాలు లేకుండా రూ. 50వేల కంటే ఎక్కువగా తరలిస్తే సీజ్ చేస్తామని అన్నారు. తనిఖీల సమయంలో వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై ఉదయ్‌కుమార్, సిబ్బంది

## గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు



నందిగామలో గొర్రెల కాపరులకు దానా పంపిణీ చేస్తున్న వైద్యులు రతన్, నరేందర్

నవీపేట, నవంబర్8: మండలంలోని నందిగామ గ్రామంలో బుధవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నవీపేట, ఎల్‌కే ఫారం పశు వైద్యాధికారులు రతన్, నరేందర్ పీపీఆర్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గొర్రెలు, మేకలకు రోగ నిరోధిక శక్తిని పెంచేందుకు గాను ఎడాదికి రెండు సార్లు పీపీఆర్ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత మందులతోపాటు ఒక్కో పెంపకం దారుడికి 100 కిలోల దానా ఉచితంగా అందజేస్తున్నట్లు వైద్యులు రతన్, నరేందర్ పేర్కొన్నారు. నందిగామ గ్రామంలో 2685 గొర్రెలు, 318 మేకలకు టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ

శక్కర్‌నగర్, నవంబర్8: బోధన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బుధవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. శివసేన పార్టీ అభ్యర్థి పసులేటి గోపికిషన్ నామినేషన్ ప్రతాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోధన్ ఆర్డీవో బి.రాజాగౌడ్‌కు అందజేశారు. బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి తరపున ఆ పార్టీ నాయకులు మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బోధన్‌కు చెందిన ఎండీ యూసుఫ్, పిరమిడ్ పార్టీ నుంచి రజిత వాని పానిగంటి తరపున పార్టీ ప్రతినిధులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఎంసీపీఐ నుంచి మోసీన్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న శివసేన పార్టీ అభ్యర్థి గోపికిషన్